స్టార్టప్‌ల్లోకి నిధుల వరద

నూఢిల్లీ, మార్చి 9: దేశీయ స్టార్టప్‌లు నిధుల సమీకరణలో దూసుకుపోతున్నాయి. ఈ వారంలో ఏకంగా 27 ఇండియన్ స్టార్టప్‌లో 308 మిలియన్ డాలర్లు లేదా రూ.2,480 కోట్ల నిధులను సమీకరించాయి. వీటిలో 17 స్టార్టప్‌లో ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. గతవారంలోనూ 32 స్టార్టప్‌లు 384 మిలియన్ డాలర్ల నిధులను సేకరించాయని స్టార్టప్ న్యూస్ పోర్టల్ ఎంట్రాక్రా శనివారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీటిలో ప్రారంభ దశలో ఉన్న 17 స్టార్టప్‌లు 166.8 మిలియన్ డాలర్ల నిధులను సేకరించాయి. ఇలాంటి స్టార్టప్‌లలో ఎంపాకెట్, ఎమా, హంచ్, రోజానాలు ఉన్నాయి. నగరాలవారీగా ఒప్పందాలు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 10 డీల్స్ జరగగా..బెంగళూరులో 9 జరిగాయి. నిధులు సేకరించిన వాటిలో డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ ఎంపాకెట్ రూ.500 కోట్లు లేదా 60 మిలియన్ డాలర్ల నిధులను బీపీఈఏ క్రెడిట్స్ ప్రైవేట్ క్రెడిట్ ప్లాట్‌ఫాం సేవల సంస్థ నుంచి సేకరించింది. ఇలా సేకరించిన నిధులను 2.4 కోట్ల మంది రిజిస్టర్డ్ కస్టమర్లకు రుణాలు అందించడానికి వినియోగించనున్నట్లు, అలాగే ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, బీమా వర్టికల్స్ పరిధిని మరింత విస్తరించడానికి వినియోగించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అలాగే గ్రామీణ ఈ-కామర్స్ సేవల సంస్థ రోజానా 22.5 మిలియన్ డాలర్ల నిధులను బర్ట్‌లెస్‌మాన్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్(బీఐఐ) నుంచి సమీకరించింది. లాజిస్టిక్-సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు, ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించనున్నట్లు రోజానా సీఈవో, కో-ఫౌండర్ అంకుర్ దాహియా తెలిపారు. జనరేటివ్ ఏఐ సొల్యూన్స్ సేవల సంస్థ ఏమా 25 మిలియన్ డాలర్ల నిధులను ఆకట్టుకున్నది. ఇప్పటి వరకు 1.14 లక్షల స్టార్టప్‌లో 12 లక్షల ఉద్యోగాలను సృష్టించాయి.

హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలం

క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

మాదాపూర్, మార్చ్ 9: హైదరాబాద్ నగరం పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉన్నదని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వీ రాజశేఖర్ రెడ్డి అన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో 2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నగరం అన్నివైపుల పెట్టుబడులకు అనువుగా ఉన్నదని, ఇక్కడ పెట్టుబడులు పెట్టడం వల్ల అభివృద్ధి చెందే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. 2050 నాటికి మెగా మాస్టర్ ప్లాన్, ప్రతిపాదిత మూసి కారిడార్ వంటి కార్యక్రమాలతో పాటు మెట్రో రైల్ విస్తరణ, నగర ఉత్తర భాగాన్ని మార్చే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో మహా నగరంగా మారనుందన్నారు.

హోండా సూపర్‌బైక్ రీకాల్

నూఢిల్లీ, మార్చి 9: హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్ఎంఎస్ఐ)..సూపర్ బైకులు జీఎల్1800 గోల్డ్ వింగ్, సీబీఆర్1000ఆర్ఆర్‌లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. పరిశీలించడానికి, ఇంధన పంపులో ఏర్పడిన సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ బైకులను వెనక్కి పిలిపిస్తున్నది. వీటిలో డిసెంబర్ 2017 నుంచి డిసెంబర్ 2023 వరకు తయారైన హోండా జీఎల్1800 గోల్డ్ వింగ్ బైకులతో పాటు సెప్టెంబర్ 2017 నుంచి ఏప్రిల్ 2020 లోపు ఉత్పత్తైన సీబీఆర్1000ఆర్ఆర్ మాడళ్లు ఉన్నాయి.

హాట్‌కేక్‌లా ఆఫీస్ స్పేస్

ఈ ఏడాది 50-55 మిలియన్ల చదరపు అడుగుల లీజు

హైదరాబాద్‌తోపాటు ఐదు మెట్రోనగరాల్లో డిమాండ్: ఫిక్కీ

వరుసగా భారత్‌లో మూడోసారి 50 మిలియన్ చదరపు అడుగుల స్థలానికి డిమాండ్ ఉంటుందని అంచనా. కార్పొరేట్ దిగ్గజాలు తమ కార్యాలయాలను విస్తరిస్తుండటం, మరోవైపు కమర్షియల్ రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉండటం కూడా కలిసిరానున్నది. లీజుకు తీసుకునే సంస్థల్లో దేశీయ సంస్థలే సగం ఉండనున్నాయి.

- అర్పిత్ మెహరోత్రా, కొల్లీర్స్ ఇండియా ఎండీ

న్యూఢిల్లీ, మార్చి 9: దేశవ్యాప్తంగా ఆఫీస్ స్థలాలను హాట్‌కేక్‌లగా ఎగరేసుకొని పోతున్నాయి కార్పొరేట్ సంస్థలు. దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ వ్యాపార విస్తరణకు భారత్ అనువైన స్థలంగా ఉంటుందని భావించడంతో ఇక్కడే నూతన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో ఈ ఏడాది దేశీయంగా టాప్-6 మెట్రో నగరాల్లో 50-55 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన స్థలాలను అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు లీజుకు తీసుకునే అవకాశాలున్నాయని ఫిక్కీ-కొల్లీర్స్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటు చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణెలలో 58.2 మిలియన్ల చదరపు అడుగుల డిమాండ్‌తో పోలిస్తే తగ్గనున్నది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కోలియర్స్ ఇండియాతో కలిసి ఇండస్ట్రీ బాడీ ఫిక్కీ తాజాగా 'ఇండియా ఆఫీస్: రీపర్పోస్డ్ టూ స్కేల్-అప్' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

మూడు అంశాలే కీలకం

మూడు అంశాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు ఫిక్కీ పేర్కొంది. ఆశావాద, వాస్తవిక, నిరాశావాద ఆధారంగా భవిష్యత్తులో ఆఫీస్ స్థలానికి డిమాండ్ ఉంటుందన్న అంచనాతో ఈ నివేదికను తయారు చేసినట్లు ఫిక్కీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఆరు మెట్రో నగరాల్లో గ్రేడ్-ఏ ఆఫీస్ స్థలానికి 50-55 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం డిమాండ్ ఉంటుందని అంచనావేసింది. ఒక వేళ ఆశావాద పరిస్థితులు ఉంటే మాత్రం 55-60 మిలియన్ చదరపు అడుగులకు పెరిగే అవకాశం కూడా ఉందన్న నివేదిక..నిరాశావాద పరిస్థితులు నెలకొంటే మాత్రం 45-50 మిలియన్ చదరపు అడుగులకు పడిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. గ్రేడ్ ఏ ఆఫీస్ స్థలానికి హాట్‌కేక్‌లో ఎగరేసుకొని పోతున్నారని, మొత్తం లీజింగ్‌లో 2019లో 34 శాతం వాటా ఉండగా, 2023 నాటికి ఇది 50 శాతానికి చేరుకున్నదని నివేదిక వెల్లడించింది.

మార్కెట్లో మళ్లీ ఎఫ్‌పీఐల కొనుగోళ్లు

ఈ నెల తొలివారంలో రూ. 11,823 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ, మార్చి 9: గత రెండు నెలలుగా భారీ విక్రయాలు జరిపిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారత్ స్టాక్ మార్కెట్లో మళ్లీ కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ మార్చి నెల తొలివారంలో రూ. 11,823 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. మార్చి 7 వరకూ ఈక్విటీతో పాటు డెట్, హైబ్రీడ్ విభాగాల్లో కలిపి మొత్తం రూ. 15,559 కోట్లు పెట్టుబడి చేసినట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ (ఎన్ఎస్‌డీఎల్) డాటా వెల్లడిస్తున్నది. దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా ఉండటం, భారత్ స్టాక్ మార్కెట్ ఆటుపోట్లకు తట్టుకోవడం వంటి అంశాలతో విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి ఆకర్షితులవుతున్నారని విశ్లేషకులు చెపుతున్నారు. విధానపరంగా ఎఫ్‌పీఐ డిస్‌క్లోజర్లను సెబీ సరళీకృతం చేయడం, పెద్ద కార్పొరేట్ల ఆర్థిక పనితీరు ప్రోత్సాహకరంగా ఉండటం సానుకూలాంశాలని బీడీవో ఇండియా పార్టనర్ మనోజ్ పురోహిత్ చెప్పారు.

100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

యూరప్‌తో నేడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, మార్చి 9: ఐటీ, ఆడియోవిజువల్ తదితర సర్వీసు రంగాల ఎగుమతులకు, వృత్తినిపుణులకు అవకాశాల్ని కల్పించే ఒక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్ ఆదివారం సంతకాలు చేయనుంది. సభ్యదేశాలైన ఐస్‌లాండ్, లీచ్‌టెనిస్టయిన్, నార్వే, స్విట్జర్లాండ్‌తో కూడిన యూరోపియన్ బ్లాక్ ఈఎఫ్‌టీఏ (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్)తో జరిగే ఈ ఒప్పందం ద్వారా వచ్చే పదేండ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని, అటువంటి పెట్టుబడుల ద్వారా దేశంలో 10 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి బ్లాక్‌కు ఎగుమతయ్యే అన్ని పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు ఉంటుందని, ప్రాసెస్డ్ వ్యవసాయ ఉత్పత్తులకు ఈఎఫ్‌టీఏ దేశాల మార్కెట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. అంతేకాకుండా ఫార్మా, మెడికల్ డివైస్‌లు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి రంగాలు కూడా ఒప్పందంలో భాగంగా ఉంటాయని, సోయా, డెయిరీ తదితర సున్నిత వ్యవసాయోత్పత్తులను జాబితా నుంచి మినహాయిస్తారని, ఈ ఐటెమ్స్‌కు సుంకాల రాయితీలు ఉండబోవని అధికారులు వివరించారు.

66 వేలకు పసిడి!

నాగపూర్, మార్చి 9: బంగారం ధరలు మరో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత వారం రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగిసింది. కమోడిటీ ఫ్యూచర్ మార్కెట్లో రూ.65 వేలు దాటి తులం బంగారం ధర శనివారం రూ.66 వేలను తచ్చాడింది. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు బంగారం ధర రూ.2,700కి పైగా పెరిగింది. వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పోవెల్ ప్రకటనతో బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,152 డాలర్లు పలికింది. అలాగే ఫ్యూచర్ మార్కెట్లో 2,158.50 డాలర్ల వద్ద ఉన్నది. అధిక ధరలతో బంగారం దుకాణాలు వెలవెలబోతున్నాయి.

ఫారెక్స్ రిజర్వులు మరింత పైకి

6.55 బిలియన్ డాలర్లు పెరిగిన నిల్వలు

ముంబై, మార్చి 9: విదేశీ మారకం నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ నెల 1తో ముగిసిన వారాంతానికి గాను ఫారెక్స్ రిజర్వులు 6.55 బిలియన్ డాలర్లు పెరిగి 625.626 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 2.975 బిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 6 బిలియన్ డాలర్లు పెరిగి 554.231 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఫారెక్స్ రిజర్వులు పెరగడానికి దోహదం చేశాయని ఆర్బీఐ పేర్కొంది. అలాగే పసిడి రిజర్వులు 569 మిలియన్ డాలర్లు ఎగబాకి 48.417 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ రిజర్వులు మాత్రం 17 మిలియన్ డాలర్లు తగ్గి 18.18 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అలాగే ఐఎంఎఫ్ వద్ద ఉన్న నిల్వలు కూడా 41 మిలియన్ డాలర్లు తరిగి 4.798 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

సీఎన్‌జీ ధరను తగ్గించిన టొరెంట్

న్యూఢిల్లీ, మార్చి 9: సీఎన్‌జీ (కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్) ధరను తగ్గిస్తున్నట్టు టొరెంట్ గ్యాస్ ప్రకటించింది. కిలో రేటుపై రూ.2.50 దించుతున్నట్టు కంపెనీ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ఆ సంస్థ ఔట్‌లెట్లలో ఈ మేరకు కొత్త రేట్లకు అమ్మకాలు జరుగుతాయి. ఇప్పటికే భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్) ధరల్ని తగ్గించిన విషయం తెలిసిందే. కాగా, తాజా నిర్ణయంతో కిలో సీఎన్‌జీ ధర రూ.90.50కు దిగొచ్చింది. ఇంతకుముందు రూ.93గా ఉన్నది. ఈ తగ్గింపుతో పెట్రోల్ వాహనదారులతో పోల్చితే 42 శాతం, డీజిల్ వినియోగదారులతో చూస్తే 32 శాతం సీఎన్‌జీ వాడకందారులకు ఆదా అవుతున్నది. ఇక తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 34 జిల్లాల్లో టొరెంట్ గ్యాస్‌కు 428 సీఎన్‌జీ స్టేషన్లున్నాయి.

ఫేమ్-2 గడువు పెంపు లేదు

న్యూఢిల్లీ, మార్చి 9: విద్యుత్‌తో నడిచే వాహనాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫేమ్-2 స్కీం గడువును పెంచే ఉద్దేశం కేంద్రానికి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టంచేశాయి. ఈ ఫేమ్-2 గడువు ఈ నెల 31న ముగియనున్నది. ఈ స్కీంను జూలై 31 వరకు పెంచబోతున్నట్లు వచ్చిన వార్తలపై కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తాజాగా స్పందించింది. అలాంటి ఉద్దేశమేది కేంద్రం వద్ద లేదని, ఈ నెల 31 లోపు ఎలక్ట్రిక్ వాహనాలను సబ్సిడీ ధరకు కొనుగోలు చేయవచ్చునని లేదా ఈ స్కీం కోసం కేటాయించిన నిధులు ఉన్నంత వరకు ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఫేమ్-2 కోసం కేంద్ర ప్రభుత్వ నిధుల కేటాయింపులు రూ.10 వేల కోట్ల నుంచి రూ.11,500 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. వీటిలో ఎలక్ట్రిక్ టూ-వీలర్, త్రీ-వీలర్, ఫోర్-వీలర్ వాహనాలపై రూ.7,048 కోట్లు సబ్సిడీ చెల్లింపులు జరిపింది.

చిత్రం

బోయపాటి దర్శకత్వంలో?

విజయ్ దేవరకొండ-బోయపాటి శ్రీను.. నిజంగా ఇది ఊహించని కాంబినేషన్. విజయ్ స్టైలిష్ చిత్రాల కథానాయకుడు. అతనిది విభిన్నమైన ఇమేజ్. ఇక బోయపాటి శ్రీను విషయానికొస్తే ఊరమాస్. వీరిద్దరి కలయికలో సినిమా అంటే, నిజంగా అది ఆసక్తికరమైన విషయమే. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వీరిద్దరి కలయికలో సినిమా చేయడానికి సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం. సదరు నిర్మాణ సంస్థ వద్ద బోయపాటి, దేవరకొండ డేట్లు ఉండటంతో వీరిద్దరి కాంబినేషన్ తెరమీదకు వచ్చింది. నిర్మాత ఆదేశాల మేరకు విజయ్ కోసం కథ తయారు చేసే పనిలో పడ్డారట బోయపాటి శ్రీను. విజయ్ దేవరకొండ కూడా నిర్మాత ఆదేశాల మేరకు కథ వినడానికి రెడీ అయ్యారట. మరి ఈ ప్రాజెక్ట్ ఏ మేరకు కార్యరూపం దాల్చుతుందో వేచిచూద్దాం!.

నాలోని కొత్త వెర్షన్‌ను చూస్తారు

కెరీర్ పీక్స్‌లో ఉండగా ఏడాది పాటు సినిమాలకు విరామం ప్రకటించడం నిజంగా సాహసం. సమంత అలాంటి సాహసమే చేసింది. 'ఖుషీ' తర్వాత ఒక్క సినిమా కూడా చేయలేదు. ఇప్పుడు మళ్లీ సినిమాలు చేయడానికి సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది సమంత. ఏడాది తర్వాత తాను చేయనున్న కమ్‌బ్యాక్ మూవీ తనకు మళ్లీ గ్రాండ్ ఎంట్రీగా ఉండాలని సమంత భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇటీవల ఈ విషయంపై ముంబయిలో జరిగిన ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడింది. 'నా కెరీర్ ఉన్నత స్థితిలో ఉన్నప్పుడే విరామం తీసుకున్నాను. ఇది నిజంగా నేను చేసిన సాహసమే. కానీ తప్పలేదు. ఆరోగ్యం కంటే కెరీర్ గొప్ప కాదని భావించాను. మళ్లీ భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకూడదనే నేను తీసుకున్న కఠిన నిర్ణయం అది. సినిమాలకైతే దూరంగా ఉన్నాను కానీ, నా అభిమానులకు మాత్రం నేను దూరంగా లేను. ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉన్నాను. కచ్చితంగా మంచి సినిమాతో వస్తాను. ఇప్పుడున్న సమంత అప్‌డేట్ వెర్షన్. కొత్తగా ఉంటుంది. మీరే చూస్తారుగా..' అంటూ అందంగా నవ్వేసింది అందాల సమంత.

పేరు మార్చుకున్న సాయిధరమ్‌తేజ్!

యువ హీరో సాయిధరమ్‌తేజ్ పేరు మార్చుకున్నారు. తన మాతృమూర్తి దుర్గ పేరును తన పేరుకు జత చేసి సాయి దుర్గ తేజ్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు. అమ్మ ఎప్పటికీ తనతోనే ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ షార్ట్ ఫిల్మ్ 'సత్య' ప్రత్యేక షోలో సాయి దుర్గ తేజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. సాయి దుర్గ తేజ్, కలర్స్ స్వాతి నటించిన ఈ షార్ట్ ఫిల్మ్‌ను దిల్‌రాజు ప్రొడక్షన్స్, విజయ్ దుర్గ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మాతలు. నవీన్ విజయ కృష్ణ దర్శకుడు. ఈ సందర్భంగా సాయిదుర్గతేజ్ మాట్లాడుతూ 'అమ్మ పేరు మీద విజయ దుర్గ ప్రొడక్షన్స్‌ను ప్రారంభించి దిల్‌రాజు ప్రొడక్షన్స్‌తో ఈ సినిమా నిర్మించాను' అన్నారు. సైనికుల త్యాగాలకు నివాళిగా ఈ లఘు చిత్రాన్ని నిర్మించామని, ఇప్పటివరకు 25 ఇంటర్నేషనల్ అవార్డులు వచ్చాయని నిర్మాత హర్షిత్ రెడ్డి తెలిపారు.

నా కెరీర్‌లో ప్రత్యేకం 'భీమా'

''భీమా' ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. ఎమోషన్స్, యాక్షన్ అంశాలు సమపాళ్లలో కుదిరాయి. డైలాగ్స్ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసలొస్తున్నాయి' అన్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా ఏ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ నిర్మించిన 'భీమా' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు గొప్ప కథతో పాటు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు కుదిరారు. నిర్మాత రాధామోహన్‌గారు ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కించారు. రవి బస్రూర్ మ్యూజిక్ సినిమాకు వెన్నెముకగా నిలిచింది. క్లైమాక్స్ ఘట్టంలో థియేటర్లు చప్పట్లతో మార్మోగిపోతున్నాయి. నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన చిత్రమిది' అన్నారు. 'విడుదలైన అన్ని కేంద్రాల్లో సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. అన్‌కాంప్రమైజ్డ్‌గా సినిమాను తెరకెక్కించాం. ఆ క్వాలిటీ తెరపై కనిపిస్తున్నది. 'పంతం' సినిమా నుంచి గోపీచంద్‌తో మా అనుబంధం కొనసాగుతున్నది' అని నిర్మాత తెలిపారు. ప్రతి సన్నివేశం కొత్తదనంతో ఆకట్టుకుంటున్నదని, రెండు పాత్రల్లో గోపీచంద్ అద్భుతమైన నటన కనబరిచాడని దర్శకుడు ఏ.హర్ష అన్నారు.

ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకుడు. లక్కీ మీడియా పతాకంపై బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 12న విడుదల కానుంది. శనివారం ట్రైలర్‌ను యువ హీరో శ్రీవిష్ణు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే చిత్రమిదని అన్నారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ 'కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. ఆద్యంతం హాస్య ప్రధానంగా ఆకట్టుకుంటుంది. నేటి యువత మనోభావాలను ఆవిష్కరిస్తుంది' అన్నారు. అందరూ కొత్తవాళ్లతో చేసిన విభిన్న ప్రయత్నమిదని దర్శకుడు విక్రమ్ రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ రెడ్డి, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, ఆర్.ఆర్.ధృవన్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: విక్రమ్ రెడ్డి.

యథార్థ ఘటనల స్ఫూర్తితో..

సాయిరామ్‌శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వెయ్ దరువెయ్'. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించారు. ఈ నెల 15న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత దేవరాజ్ పోతూరు మాట్లాడుతూ 'చక్కటి ప్రణాళికతో 35రోజుల్లో ఈ చిత్రాన్ని పూర్తి చేశాం. దీనివల్ల ప్రొడక్షన్స్ ఖర్చు చాలా తగ్గింది. ఇక ఈ కథలో కడుపుబ్బా నవ్వించే కామెడీ, సెంటిమెంట్ అంశాలుంటాయి. యథార్థ ఘటనల స్ఫూర్తితో దర్శకుడు ఈ కథ తయారు చేశాడు. కామారెడ్డిలో కథ మొదలవుతుంది. అక్కడి నుంచి హీరో హైదరాబాద్‌కు వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఫస్ట్‌కాపీ చూసి చాలా హ్యాపీగా ఫీలయ్యాం. సీనియర్ నటీనటులు ఈ సినిమాలో భాగమయ్యారు. భీమ్స్ మ్యూజిక్ సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. ఇకముందు కూడా లిమిటెడ్ బడ్జెట్‌లోనే సినిమాలు చేస్తాను' అన్నారు.